# ప్రాథమికతలు

- అంబల్ల జనార్దన్



"ఎక్కడికెళ్లావు?"

"ఈ.టీ.వీ.లో మంచి ప్రోగ్రాముంటే పక్కింటికెళ్లానండీ!"

"మన టీ.వీ.కేమయింది?"

"చాల్లెండి, మనదీ ఒక టీవీయే? కలరూ లేదూ, పాడూ లేదూ! తాతల కాలంనాటి సినిమాల్లోలా ఒట్టి నలుపు - తెలుపు!"

"దినమంతా పనిచేసి, బస్సులో నానా తంటాలూ పడి కొంపచేరితే ఓ కాఫీ, కాస్త ఫలహారం ఇచ్చి సేద తీర్చడం పోయి, కలరు టీ.వీ. పిచ్చి ఏమిటి పద్మా నీకు?"

"ఔనండీ! నాది పిచ్చనే అనిపిస్తుంది మీకు! చుట్టుపక్కలంతా ఎంచక్కా కలర్ టీ.వీ. ఉండి, మన ఒకరింట్లోనే బ్లాక్ అండ్ వైట్ టీ.వీ. అంటే ఎంత నామోషీగా ఉందో తెలుసా? అమ్మలక్కలు- మనం పీనాసివాళ్లం, కక్కుర్తి మనుషులం అని చెవులు కొరుక్కుంటుంటే తలెత్తుకోలేకపోతున్నాను. మీకేం? దినమంతా ఆఫీసులో ఉంటారు, ఇంట్లో ఉన్నవాళ్లకు - తెలుస్తుంది!"

"పే కమిషన్ ఎరియర్స్ రాగానే మనం చేసే మొదటిపని కలర్ టీ.వీ. తేవడం! సరేనా! ఇప్పుడైనా కాస్త కాఫీనీళ్లియ్యి!"

"మీ ఎరియర్స్ ఎప్పుడొస్తాయో, మన ఇంటికి కొత్త టీ.వీ. ఎప్పుడొస్తుందో ఆ భగవంతుడికే తెలియాలి!" అంటూ వంటింట్లోకి దారితీసింది పద్మ.

"ఎంత ... ఇంకొక్క రెణ్నెల్లు ఓపికపట్టు!" అని టీ.వీ. ఆన్ చేశాడు రంగనాథం.

రంగనాథం కేంద్ర ప్రభుత్వోద్యోగి. నెల జీతం అయిదువేలకు పైనే ఉన్నా, ముంబాయి మహానగరంలో, ముగ్గురు పిల్లలతో సంసారం నడపడానికి హైరానా పడవలసివస్తోంది. ముక్కుకు సూటిగాపోయేరకం అవడంవల్ల పై సంపాదన లేదు. వచ్చిన దాంతోనే పొదుపుగా, గుంభనగా రోజులు వెళ్లదీస్తున్నాడు. పెద్దబ్బాయి శిరీష్ బి.కామ్. పాసై డి.టి.పి. డిప్లొమా చేస్తున్నాడు. పార్ట్‌టైమ్ కంప్యూటర్ ఆపరేటరుగా తన సొంతఖర్చులకు సంపాదిస్తున్నాడు. అమ్మాయి ఇంటరు చదువుతోంది. చిన్నబ్బాయి ఎనిమిదవ తరగతిలో ఉన్నాడు.

రాత్రి తొమ్మిది తర్వాత శిరీష్ రాగానే కుటుంబసభ్యులంతా భోజనానికి కూర్చున్నారు.

"ఎంతదాకా వచ్చింది నీ డిప్లొమా?" శిరీష్‌నడిగాడు రంగనాథం.

"వచ్చే నెల పరీక్షలున్నాయి, నాన్నా!"

"ట్రెనింగ్ బాగా అయిందా?"

"అయింది. డిస్టింక్షన్ తప్పక వస్తుంది, నాన్నా!"

"ఇప్పటినుండే ఉద్యోగాలకు అప్లై చేస్తూండు. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజిలో రిజిస్టరు చెయ్!"

"నాకు ఉద్యోగం చేయడం ఇష్టం లేదు నాన్నా!"

"ఉద్యోగం చేయక?"

"సొంత డి.టి.పి. సెంటర్ పెట్టుకోవాలని

ఉంది!"

"పెట్టుబడి సంగతి ఆలోచించావా? భోంచెయ్, ఆ తర్వాత మాట్లాడదాం!"

భోజనాలయిన తర్వాత పద్మ, చిన్నపిల్లలు టీ.వీ. ముందు కూర్చుంటే, తండ్రీకొడుకులు లోపలి గదిలోకెళ్లారు.

"ఇప్పుడు చెప్పు నీ ఉద్దేశ్యం."

"దరఖాస్తులు పంపుతూ, టెస్టులు రాస్తూ, ఇంటర్వ్యూలకు అటెండవుతూ ఉద్యోగం కొరకు పడిగాపులు పడేదానికన్నా ఓ కంప్యూటరు కొనుక్కుని డి.టి.పి. సెంటరు పెట్టుకోవాలని ఉంది."

"ఎంతవుతుందేమిటి?"

"కొత్త మెషినయితే లక్ష రూపాయలు పైనే కావచ్చు. పాతది కొంటే యాభైవేల లోపల వస్తాయి."

"డబ్బెక్కడినుండి వస్తుందని?"

"మీరు సర్దుతే సరే, లేకపోతే బాంకులోనుకు ప్రయత్నం చేస్తాను."

"మన స్థితిగతులు నీకు తెలియనివి కావు. ఇప్పటికే ఆఫీసులో దొరికే అన్ని లోన్లూ తీసుకున్నాను. వాటి వాయిదాలు పోను, చేతికొచ్చే జీతంతో, ఇంటిఖర్చులతో ఎలా నెగ్గుకొస్తున్నానో నాకు తెలుసు, పైన భగవంతునికి తెలుసు. నీవు ఉద్యోగంలో చేరితే నాకు వెసులుబాటుగా ఉంటుంది."

"నేనడిగేది నా సొంత ఖర్చులకు కాదు, నాన్నా! ఇంటికి పెద్దబ్బాయిగా నా సొంత బాధ్యతలు తెలుసు. మనం ఇంకా మంచి జీవితం గడపాలనే నా ఆశయం. ఏ ఉద్యోగం చేసినా గొర్రెతోక బెత్తెడే అన్నట్టు, వచ్చిన జీతం మన కనీసఅవసరాలు కూడా తీర్చలేదు. అదే వ్యాపారమైతే మన ఆదాయానికి హద్దుండదు. మన శ్రమ ఫలితం మనమే అనుభవించవచ్చు!" ఇరవై రెండేళ్ల శిరీష్‌లో యువకరక్తం ఉరకలు వేస్తోంది.

"వ్యాపారం అంటే మాటలా? పెట్టుబడి కావాలి. నేర్పు కావాలి. వాయిదాలకు, వడ్డీలకు, ఖర్చులకు సరిపడ ఆదాయముంటుందనే గారంటీ ఏమిటి?"

"అవన్నీ ఆలోచించాను, నాన్నా! నేను కంప్యూటరు తీసుకుంటే ఇంట్లోనే పనిచేయవచ్చు. ఇన్‌స్టిట్యూట్ వాళ్లే జాబ్‌వర్క్ ఇస్తారు. అదనపు కంప్యూటర్లు లేక, తగిన పనివారులేక వారు కొత్తక్లయింట్లను తీసుకోవడంలేదు. తీసుకున్న పని కూడా సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారు."

"బిజినెస్ ఇలానే వస్తుందని నమ్మకమేమిటి? పోటీ పెరిగి వ్యాపారం దెబ్బతినవచ్చు."

"డి.టి.పి. అంటే డెస్క్ టాప్ పబ్లిషింగ్. బిజినెస్ తగ్గే ప్రసక్తే లేదు. ముద్రణ అవసరం ఎంతదాకా ఉంటుందో అంతదాకా ఈ బిజినెస్‌కు ఢోకా లేదు. మూడేళ్లకింద ఒక్క కంప్యూటరుతో మొదలుపెట్టిన మా ఓనరు ఇప్పుడు అయిదు కంప్యూటర్లు, రెండు లేజర్ ప్రింటర్లు, రెండు డాట్ మ్యాట్రిక్స్ ప్రింటర్లను నడిపిస్తున్నాడు. జాబ్‌వర్క్‌తోపాటు కంప్యూటర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ నడుపుతూ నాలుగు కాదు, పదహారు చేతులా సంపాదిస్తున్నాడు!"

"పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టు ఎవరో ఏదో చేసి సంపాదిస్తున్నారని మనం కూడా అలా చేద్దామంటే అయ్యేపనేనా? దానికితగ్గ అనుభవం ఎక్కడుంది నీకు? బిజినెస్ నడిపే చాకచక్యం నీకుందనే అనుకుంటున్నావా?"

"క్షమించండి, నాన్నా! మీకు చెప్పదగ్గవాణ్ని కాను! 'ధైర్యే సాహసే లక్ష్మీ!' అని మీరే అంటూంటారు కదా ! పని చేస్తేనే కదా అనుభవం వచ్చేది?"

"సరే, ఆలోచిద్దాం. పరీక్షలు మాత్రం బాగా చెయ్!" అని పడుకోడానికి లేచాడు రంగనాథం.

* * *

"ఏమిటండీ, అంతరాత్రిదాకా మీ తండ్రీ కొడుకుల మంతనాలు? మంచి సినిమా మిస్సయ్యారు!" పొద్దున కాఫీ ఇస్తూ అంది పద్మ.

"నీ టీ.వీ. పిచ్చి నీదే కానీ, మన సంసారం గురించి, బతుకుబాట గురించి ఎప్పుడైనా ఆలోచించావా?"

"మీరుండగా సంసారం గురించి నేనెందుకు ఆలోచించాలి? అయినా ఇప్పుడు మన బతుకు బాటకేమొచ్చింది?"

"నేనసేది మనగురించి కాదు. మన పిల్లల బతుకుతెరువు గురించి. శిరీష్ వ్యాపారం చేస్తాడట. స్వయంవుపాధి పిచ్చి తలకెక్కింది. పెట్టుబడికి డబ్బులు సర్దాలట. హాయిగా, ఉద్యోగం కోసం ప్రయత్నించరా అంటే ససేమిరా అంటున్నాడు!"


"మీరేమాలోచించారు?"


"నా కెటూ తోచడంలేదు. సాయంత్రం పంచాక్షరి దగ్గరికెళ్తాను. ఈ విషయంలో అతనే సరైన సలహా ఇవ్వగలడు."

పంచాక్షరి చార్టెడ్ ఎకౌంటెంట్. సొంత ప్రాక్టీసు. బాగా నడుస్తోంది. అతనూ, రంగనాథం ఎల్.ఎల్.బి.లో సహాధ్యాయులు. ఇద్దరూ ముక్కుకి సూటిగా పోయేవారవడం వల్ల వారి మధ్య స్నేహం కలిసింది. గట్టిపడింది. స్థాయీభేదం వారి మిత్రత్వానికి అడ్డు కాలేదు.

రంగనాథం పంచాక్షరి ఆఫీసుకి చేరేసరికి సాయంత్రం ఆరున్నర అయింది. టీ, ఫలహారాల తర్వాత, కబుర్లలో పడ్డారు మిత్రులు.

"ఆఁ ... ఏమిటీ అకాల దర్శనం?" సాధారణంగా ఆదివారాల్లో తప్ప కలవని మిత్రుణ్ని అడిగాడు పంచాక్షరి.





## కార్ల పరీక్ష!

**కొ**త్తరకం కార్లు మార్కెట్‌లోకి రాబోయేముందు వాటిని రకరకాల రోడ్లపై నడిపి పరీక్షిస్తారు. ఒక్కోదఫా నిర్మించే కొన్ని వందలకార్లలో కొన్నింటిని నమూనాగా తీసుకుని, వాటిని నడిపి పరీక్షిస్తారు. అలా పరీక్షించటానికి వీలుగా ప్రతి కార్లకంపెనీలోనూ శిక్షితులైన డ్రైవర్లు ఉంటారు. ఆ కంపెనీవారే ప్రత్యేక తరహా రోడ్లను నిర్మించుకుంటారు. వంపులు తిరిగి, ఎత్తు పల్లాలతో, గతుకులు గతుకులుగా ఉన్న రోడ్లను నిర్మించి మధ్యమధ్యలో ఆ రోడ్లు వర్షంలో తడిస్తే ఎలా ఉంటుందో ఆ విధంగా నీళ్లతో తడుపుతారు. కారును నడిపేటప్పుడు డ్రైవరు విధిగా హెల్మెట్ ధరించాలి. 15 నిమిషాలకు మించి ఏ డ్రైవరూ కార్లను నడపరు. ఈ విధంగా రకరకాలుగా ఉన్న ఆ రోడ్లపై కార్లు ఎలాంటి మార్పులకు గురవుతున్నాయో తెలుసుకునేందుకు ఆ కార్ల ముఖ్యభాగాల్లో సునిశిత పరికరాలు అమర్చి వాటిద్వారా ప్రాథమిక ప్రయాణంవల్ల కారు ఎలాంటి మార్పులు చెందుతుందో నమోదు చేస్తారు. డ్రైవర్ల స్థానంలో రబ్బరు బొమ్మలను ఉంచి, కార్లకు రకరకాల ప్రమాదాలు సృష్టిస్తారు. ఆ దశలో ఆ బొమ్మ ఏ విధంగా బయటపడుతుందో, దానికి ఎక్కడెక్కడ ఎందువల్ల గాయాలు తగులుతున్నాయో తెలుసుకుంటారు. ఇలా జరగకుండా ఉండేందుకు కార్లకు అవసరమైన రక్షణ సౌకర్యాలను సమకూరుస్తారు.

- పృథ్వీరాజ్

"మా శిరీష్ విషయంలో నీ సలహా తీసుకుందామని."

"ఉద్యోగం చూడాలా? డి.టి.పి. చేస్తున్నాడు కదా! పూర్తయిందా?"

"ఇంకా లేదు. వచ్చే నెల పరీక్షలు. వాడికి ఉద్యోగం చేయడం ఇష్టం లేదు. సొంత డి.టి.పి. సెంటర్ పెట్టుకోవాలనుకుంటున్నాడు."

"భేష్! నా గాడిలోకి వస్తాడన్నమాట! అభినందనలు!"

"నువ్వు వాడికి వత్తాసు పలుకుతున్నావా? మాలాంటి వాళ్లతో వ్యాపారం అయ్యేనా? పెట్టుబడి ఎక్కడినుండి తేవడం?"

"ఏం? మీకేం తక్కువ? వ్యాపారం చేసేవాళ్లు పైనుండి ఊడిపడతారా? ఇక పెట్టుబడి సంగతి నాకు వదిలెయ్!"

"నా విషయం నీకు తెలుసుగా, మన మధ్య డబ్బు లావాదేవీలు వద్దు! మన స్నేహం ఇలానే ఉండనీ!"

"అదిసరే,శిరీష్ నొకసారి కనిపించమను. కనుక్కుంటాను. ఎంత లోతులో ఉన్నాడో తెలుసుకుంటాను. పైపై ఉత్సాహం అనిపిస్తే ఉద్యోగం చేయమంటాను. పట్టుదలతో పైకొస్తాడనుకుంటే చేయూతనిస్తాను!" పంచాక్షరి మనస్ఫూర్తిగా అన్నాడు.

"మావాడి పథకంపై నీకు నమ్మకం కలిగితే పెట్టుబడి ఎలాగో సర్దుతాను. మిగతా విషయాలు నీవు చూసుకో!" అభిమానధనుడైన రంగనాథం మిత్రుణ్ని కోరాడు.

"పే కమిషన్ ఎరియర్స్ ధీమానా అది?"

"ఆ ఎరియర్స్ ఎప్పుడో కలర్ టీ.వీ.కి అంకితమయ్యాయి. అవి చేతికి రావడమే తరువాయి, ఇంట్లో కలర్‌టీ.వీ. కళకళలాడబోతోంది!" భవిష్యత్తును తలుచుకుని సంబరపడ్డాడు రంగనాథం.

"టీ.వీ. అంత అవసరమంటావా? అదే డబ్బుల్తో కంప్యూటర్ కొంటే వడ్డీ దక్కుతుంది, ఆదాయం వస్తుంది!" పంచాక్షరిలోని సి.ఏ. బయటకు వచ్చాడు.

"నేను పద్మకిచ్చిన మాట? ఆ తర్వాత నేను సుఖంగా ఉండగలనా?" భార్యను తలుచుకోగానే వణుకు పుట్టింది రంగనాథానికి.

"అది మీ ఇద్దరూ తేల్చుకోవలసిన విషయం. వినోదమా? బతుకుతెరువా? ఆలోచించుకోండి. ప్రాథమికతలు నిర్ణయించుకోండి. ఈలోగా శిరీష్‌ను పంపించు!"

* * *

"రావోయ్, రా! ఇండస్ట్రియలిస్ట్ కావాలని కలలు కంటున్నావట, నిజమేనా?" తన ఆఫీసుకు వచ్చిన శిరీష్‌ను పలకరించాడు పంచాక్షరి.

"మీలాంటి పెద్దల అండతో, ఆశీర్వాదాలతో, పారిశ్రామికవేత్తను కూడా అవుతానేమో! ప్రస్తుతానికి మాత్రం నా కాళ్లమీద నిలబడాలనుకుంటున్నాను, అంకుల్!" సరైన జవాబిచ్చాడు శిరీష్.

"జాబ్‌వర్క్‌కు మీ ఇన్‌స్టిట్యూట్ వారిమీదే ఆధారపడతావా, లేక వేరే ఎవరినైనా చూశావా?"

"చాలామందిని కలిశానంకుల్! కొందరు డి.టి.పి. పని ఇస్తామని వాగ్దానం చేశారు. ముఖ్యంగా తెలుగు సాఫ్ట్‌వేర్ పెట్టాలని ఉంది. తెలుగు ప్రింటింగ్ వసతులు అంతగాలేని ముంబాయిలో ఈ సౌకర్యం కల్పిస్తే ఇక్కడ దాదాపు పదిలక్షలున్న తెలుగువారు ఆ మాత్రపు పని ఇవ్వకపోరు. అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలు, ప్రింటింగ్‌ప్రెస్‌లు ఇచ్చే పని అదనంగా వస్తుంది!" దృఢంగా అన్నాడు శిరీష్.

శిరీష్ మాటలతో ఇంప్రెస్ అయిన పంచాక్షరి అతని డి.టి.పి. సెంటర్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడు. రంగనాథం పెట్టుబడి సన్నాహాలు చేయసాగాడు. పద్మ కలర్ టీ.వీ. ఇంకొంత దూరంపోయింది. ప్రాథమికతల పందెంలో బతుకుతెరువు ముందు వినోదం వీగిపోయింది.

జీవితంలో ఓ కొత్తపాఠం నేర్చుకున్నారు రంగనాథం, పద్మ దంపతులు. ■